


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

వైఎస్ఆర్ కడప

శనివారం 07 జూన్ 2025

పేజీలు - 08



# ప్రమాదం ఉన్నా.. నిర్లక్ష్యమే!

రూ.7.05 కోట్లే మంజూరు


ప్రాజెక్టుల భద్రత గాలికి..

కనీస మరమ్మత్తులపై దృష్టి పెట్టని ప్రభుత్వ పెద్దలు

నీటి లీకేజీ, కృంగిన కట్టలు, పనిచేయని గేట్లు

ఇసుక బస్తాలతో అధికారులు సర్దుకునే ప్రయత్నం

ప్రతిపాదనలు పంపిన పట్టించుకోని ఉన్నతాధికారులు



కడప బ్యూరో - మేజర్‌న్యూస్

ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం కారణంగా కడప జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. అడపాదడపా చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. క్షేత్రస్థాయిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు నిధులివ్వాలని నీటిపారుదల శాఖ సాంకేతిక నిపుణులు రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనలు చేతనావస్థ స్థితిలో ఉన్నాయి. వాస్తవ పరిస్థితిని వివరిస్తూ పంపిన ఈ ప్రతిపాదనలను అధికారులు అంగీకరిస్తూనే చిల్లర కేటాయింపులతోనే సరిపెట్టారు. రూ.7.05 కోట్లు నిధులు కేటాయిస్తూ నీటిపారుదలశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి ఎ.అనంతరాము మే 31న ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి ఏమూలలకు సరిపెట్టాలో అర్థంకాక అధికారులు తలలుపట్టుకుంటున్నారు. బ్రహ్మసాగర్, సర్వరాయ సాగర్, వామికొండ, చిత్రావతి ప్రాజెక్టులు తీవ్ర లీకేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. వీటికి అత్యవసరంగా నిధులు కేటాయించాల్సి ఉంది. 2లో

మత సామరస్యానికి ప్రతీక కడప 4లో

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష 3లో

భయపెడుతున్న జూన్ 4లో

రెవెన్యూ హెచ్చరిక బోర్డులు ఉన్నా...

## ఆగని కొండభూమి ఆక్రమణలు



చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న కొండపోరం బోకు ఆక్రమణలు

గత ప్రభుత్వంలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

హెచ్చరిక బోర్డులను లెక్కచేయకుండా యదేచ్ఛంగా ఆక్రమణలు

ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్: ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గోపులాపురం గ్రామంలో కొండ పోరంబోకు స్థలాలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. సమీప గ్రామస్తులు ఎలాంటి అనుమతి లేకుండా కొండపోరం బోకు స్థలాలను ఆక్రమించుకొని పంట పొలాలుగా మార్చుకుంటున్నారు. ఈ విషయాన్ని మిగతా 2పేజీలో

టీడీపీ పాలనలోనే

## రాష్ట్ర అభివృద్ధి

వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిర్వీర్యం

జిందాల్‌తో ఉక్కు పరిశ్రమ పూర్తి

టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కడప రూరల్, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ అధికారంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, వైసిపి రాష్ట్రంలో అభివృద్ధి నిర్వీర్యం చేసి పాలన సాగించిందని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ..మిగతా 2పేజీలో



# ప్రమాదం ఉన్నా.. అదే నిర్లక్ష్యమే!

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్:** ఉమ్మడి కడప జిల్లాలో 15 చిన్న, మధ్యతరహా, పెద్ద జలాశయాలున్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 84.984 టీఎంసీలు కాగా, ఆయకట్టు 5,03,248 ఎకరాలు. అయితే ఈ సాగునీటి ప్రాజెక్టుల వల్ల పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ఆయకట్టుకు నీరు ఇవ్వలేక చేతికిల పడుతున్నాయి. కనీస మరమ్మతులకు నోచుకోవటం లేదు. నీటి లీకేజీలతో సతమతమవుతున్నాయి. కృంగిన కట్టలు, గేట్ల నిర్వహణ అధికారులకు ఇబ్బందికరంగా మారింది. ప్రాజెక్టుల భద్రతకు ప్రమాదం లేదని చెబుతూనే ప్రభుత్వ తీరుపై ఆసహనం చూపుతున్నారు. అత్యవసర మరమ్మత్తుల కోసం ప్రతిపాదనల పంపడంతోనే చేతులెత్తేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ తీరునే అవలంభిస్తోంది. అత్యవసర నిధులను కోరితే చిల్లర విదిలింపులతోనే సరిపెడుతోంది. జిల్లా నుంచి నీటిపారుదల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించి అత్యవసరమైన వాటిని చేపట్టాలని పచ్చజెండా ఊపారు. కానీ నిధులే మంజూరు చేయడం లేదు. కేవలం రూ. 7.05 కోట్లు నిధులు కేటాయిస్తూ నీటిపారుదలశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి ఎ.అనంతరాము గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తారని రైతులు కోటి ఆశలు పెట్టుకొన్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లా పరిధిలో జరుగుతున్న పనులు, అధికారులు, ఉద్యోగుల జీతాలు, కార్యాలయాల నిర్వహణ, ప్రణాళికయేతర పద్దు కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,331.41 కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదించారు. గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. వారి బకాయిలు రూ.836.55 కోట్లు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. గాలేదు- నగరి సుజల స్రవంతి పథకం మొదటి దశలో చేపట్టిన వరద కాలువ, గండికోట సొరంగం, ప్యాకేజీ-1, వామికొండ, సర్వరాయసాగర్, రెండో దశలో ప్యాకేజీ 1-7 వరకు నిర్మాణంలో ఉన్న పనులు, బిల్లులు తదితరాలకు రూ.1,281.8 కోట్లు కావాలన్నారు. పీబీసీ హెడ్ కింద జరుగుతున్న పనులకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.745.7 కోట్లు అవసరమని అంచనా వేశారు. తెలుగుగంగ పథకంలో జరుగుతున్న పనులకు రూ.65.22 కోట్లు, మైలవరంలో ఉత్తర, దక్షిణ కాలువల నవీకరణకు, స్పిల్ వే గేట్ల మరమ్మత్తులు, రక్షణ గోడ నిర్మాణానికి రూ.7 కోట్లు, వెలిగల్లుకు రూ.2.72 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ నిధులు విడుదల చేస్తే అత్యవసర పనులను పూర్తి చేస్తామని అధికారులు విన్నవించారు. కానీ రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన లభించలేదు.

**అన్నీ ప్రాజెక్టులు ప్రమాదంలోనే..**


జిల్లాలో కీలకమైన బ్రహ్మ సాగర్, చిత్రావతి, సర్వరాయ సాగర్, వామికొండ.. ఇలా ప్రాజెక్టులన్ని లీకేజీలతో ప్రమాద సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో విస్తారంగా కురిసిన వర్షాలతో సాగునీటి ప్రాజెక్టులు జల కలను సంతరించుకున్నాయి. అయితే గత ఐదేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికార యంత్రాంగం వాపోతోంది. పలు ప్రాజెక్టుల వద్ద కట్ట రివిట్మెంట్ దెబ్బతింది. గేట్లు కదలడం లేదు. ఇసుక బస్తాలతో అధికారులు సర్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. లీకేజీల కారణంగా పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయలేకున్నారు. నిల్వచేసిన నీరు కూడా లీకేజ్ అవుతోంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్ గా తీసుకోవడం లేదు. సర్వరాయసాగర్ ప్రాజెక్టు లీకేజ్ పనులకు సంబంధించి రూ.12.10 కోట్లు, వామికొండ కింద రూ.8 కోట్ల వ్యయంతో కూడిన పనులకు ప్రతిపాదనలు పంపించడమైంది. గత డిసెంబర్ నాటికి రిజర్వాయర్ కట్ట కింది భాగంలో నీటి లీకేజీని అరి కట్టడానికి అత్యాధునిక సాంకేతిక తో గ్రౌటింగ్ పనులు పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ ముందుకు సాగడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులపై గత, ప్రస్తుత ప్రభు త్వాల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అదేవిధంగా పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీసీ)లో నీరు నిల్వ ఉన్న అంతర్గత భాగంలో రాతి కట్టడం దెబ్బతింది. స్పిల్‌వే లోని అత్యవసర గేట్లు (రివర్స్ స్లూయిస్) నుంచి నీరు వృథాగా పోతోంది. రబ్బరు సీళ్లు దెబ్బతిని లీకులేర్ప డ్డాయి. లింగాల కుడి కాలువకు నీరు విడుదల తూము గేటు సులువుగా కదలడం లేదు. రెండున్నరేళ్ల కిందట వరదలకు కుడి వైపున 35 మీటర్లు, ఎడమ వైపు 300 మీటర్ల మేర కోతకు గురైంది. ఇక మైలవరం జలాశయంలో నీటిని విడుదల చేసే అత్యవసర గేట్లు రెండు మొరాయిస్తున్నాయి. స్పిల్ వే రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. హెడ్ రెగ్యులేటరు గేటు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. కట్టపై ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతింది.

**రూ.7.05 కోట్లు నిధులు మంజూరు..**

జిల్లాలో చిన్న, మధ్యతరహా, పెద్ద జలవనరుల నిర్వహణకు అవసరమైన రూ. 7.05 కోట్లు నిధులు కేటాయిస్తూ నీటిపారుదలశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి ఎ.అనంతరాము గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల బ్రాంచి కాలువ, లింగాల కుడి కాలువ, తెలుగుగంగ, గాలేరు-నగరి సుజల స్రవంతి, మైలవరం జలాశయంతో మరికొన్ని ప్రాజెక్టుల పరిధిలో పనులు చేయాల్సిన అవసరం ఉందని ఇంజినీర్లు గుర్తించారు. నిధులివ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు జిల్లాలో 80 పనులు చేపట్టాలని అనుమతిచ్చారు. పని విలువ రూ.10 లక్షల లోపు ఉంటే సాగునీటి సంఘాల ద్వారా, రూ.10 లక్షలకు మించి ఉంటే టెండరు పిలవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

### ఇన్‌చార్జి తాసిల్దార్ వరద కిషోర్ రెడ్డి



ముద్దనూరు, మేజర్‌న్యూస్: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ముద్దనూరు ఇన్‌చార్జ్ తాహల్దార్ వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకునే టట్లు తగు సలహాలు, సూచనలు అందించే విషయమై, స్థానిక తాహసి ల్దార్ కార్యాలయంలో శాంతి కమిటీ సభ్యులు, అన్ని మతాల మత పెద్దలతో కమిటీ సమావేశాన్ని నిర్వహించినట్లు తహసిల్దార్ వరద కిషోర్ రెడ్డి వివరించారు. ముద్దనూరు ఇన్చార్జ్ ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి ఈ సమావేశానికి హాజరయ్యారు. మన కడప జిల్లా మతసామరస్యానికి ప్రతి కగా ఉందన్నారు. ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా సలహాలు, సూచనలను అందించడం జరిగిందని తాసిల్దార్ వరద కిషోర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహనను పెంచుకొని, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుచర్ల వెటర్నరీ డాక్టర్ హిమబిందు, ఏఎస్ఐ శ్రీనివా సులు, వీఆర్వో రాజశేఖర్ నాయుడు, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## రెవెన్యూ హెచ్చరిక బోర్డులు ఉన్నా.. ఆగని కొండభూమి ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)

గమనించిన గత ప్రభుత్వం అప్పటి యర్రగుంట్ల తాహసి ల్దార్ సౌజన్య కొండపోరం బోకు స్థలాల ఆక్రమణ లపై ఉక్కు పాదం మోపి రెవె న్యూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినారు. సర్వే నంబర్ 849 లో కె గోపులాపురం, పి గోకు లాపురం గ్రామాల మధ్య మైలవరం కాలువ అతి సమీపంలో రోడ్డు ఆను కొని ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారు. ఈ విషయాన్ని గమ నించిన గత ప్రభుత్వంలో అధికారులు చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డుల ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు వేసిన హెచ్చరిక బోర్డులను పక్కన పడేసి ఆక్రమణలను యధేచ్చంగా చేపట్టారు. ఇదేమిటి అని అడిగే అధికారి కూడా కరువైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి కొండపోరం బోకు స్థలాలను కాపాడవలసిన అవసరమెంతైనా ఉందని పలువురు అభిప్రాయం పడుతున్నారు.

## టిడిపి పాలనలోనే రాష్ట్ర రాష్ట్ర అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని ఆయన నివాసంలో శు క్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి జగన్ ఒక తట్ట మట్టి ఎత్తలేదని, ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని, ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలను మభ్య పెట్టటానికి వేలకోట్ల అభివృద్ధి పనులకు జీవోలు మాత్రం ఇచ్చారన్నారు. పారిశ్రామిక హబ్‌గా కొప్పర్తికి మహర్దశ తెచ్చింది చంద్రబాబు అన్నా రు. ఉక్కు పరిశ్రమకు చంద్రబాబు భూమి పూజ చేస్తే, జగన్ మరొకచోట భూమి పూజ చేసి నిర్మాణాన్ని గాలికి వదిలేసి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ను మోసం చేశారని చెప్పారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం జిందాల్ జరుగుతుందని, మూడేళ్లలో పూర్తి చేసి, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కడప దాహార్తిని శాశ్వత పరిష్కారం కోసం రూ. 500 కోట్లతో బ్రహ్మ సాగర్ నుండి నీటిని తీసుకువ చ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ క్రమ పద్ధతిలో అమలు చేస్తామని, దేశంలో నాలుగు వేలు పెన్షన్ అమలు కాలేదని, ఒక్క ఏపీలోనే అమలవుతుందని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ ఉంటే, దగా రోజు నిర్వహిస్తారా అని వైసిపి నేతలను ఆయన ప్రశ్నించారు. దశల వారీగా మద్యనిషేధం ఏమైందని, మద్యాన్ని ఏరులై పారించి, మట్టి, ఇసుక, సహజ వనరులను లూటీ చేశారని మండిపడ్డారు. విసిగి, వేసారిన ప్రజలు కూటమికి 106 సీట్లు ఇచ్చి, వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. మునిగిపోయిన వైసీపీ, ఉనికి కోసం ఎగిరి పడితే, ఒక్క సీటుకే పరిమితం అవ్వడం ఖాయమని ఆయన బల్ల గుద్ది చెప్పారు.

# ఒక తండ్రి త్యాగం... ఒక సంప్రదాయ మార్గం - బక్రీద్

**లింగాల మేజర్‌న్యూస్:** ఒక ఊరి లో ఉండే రహీమ్ ఇంటి గుమ్మం దగ్గర బక్రీద్ సందడిలో వుండగా చిన్న పిల్లాడు కిరణ్ చేతిలో పాడయి పోయిన ఫోన్ తో వచ్చాడు. అన్నా, బక్రీద్ అంటే మీ గొర్రెను మామూలుగా బలి ఇస్తారు కదా? నిజంగా దేవుడికి అవసరమా అది?" అని అమాయకంగా అడిగాడు. రహీమ్ చిరునవ్వు నవ్వాడు. "రా బాబూ, నువ్వు అడిగిందే నిజమైన ప్రశ్న. దేవుడికి మాంసం, రక్తం కావలసిన పనిలేదు. మన మనసు ఎంత దానాన్ని విడిచిపెట్టగలదో, అదే ఆయనకు కావాల్సింది."అంటూ బక్రీద్ వెనక వున్న కథను ఇలా చెప్పాడు. బక్రీద్ చరిత్ర - త్యాగానికి ఓ చిరస్థాయితనం బక్రీద్ అనేది ఇస్లాం మతంలోని అత్యంత పవిత్ర పండుగలలో ఒకటి. దీనిని "ఈద్-ఉల్-అజ్హా" అని కూడా అంటారు. ఈ పండుగ వెనక ఓ గొప్ప త్యాగగాథ ఉంది . అల్లా యొక్క శ్రద్ధను, భక్తిని నిరూపించేందుకు ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన ప్రేమించిన కొడుకు ఇస్మాయిల్‌ను బలిగా అర్పించేందుకు సిద్ధపడ్డాడు. అల్లా, ఈ భక్తిని మెచ్చి చివరివేళలో ఒక దేవదూత ద్వారా ఆ బాలుడి స్థానంలో ఒక గొర్రెను బలి ఇవ్వాలని పలికిస్తాడు. అందుకే అప్పటి నుండి ప్రతి ముస్లిం, బక్రీద్ రోజున ఒక జంతువును బలిగా అర్పిస్తూ - తాము సిద్ధంగా ఉన్న త్యాగాన్ని గుర్తుచేసుకుంటారు. అయితే ఇది కేవలం నిబంధన కాదు...నీ మనసు ఏదైనా విడిచిపెట్టగలదా? నీవు పంచుకోగలవా? అనే ప్రశ్న.



**సమకాలీన జీవితం - బక్రీద్ యొక్క కొత్త అర్థం**

ఈరోజుల్లో వారు గొర్రెను కొనడమే కాదు... దాన్ని రోజూ ప్రేమగా చూసుకుంటారు. ఇది నా మనసుకు దగ్గరైన జంతువు. అయినా సరే నేను త్యాగం చేస్తా అని చెబుతారు. ఇలాంటి త్యాగ భావన చిన్నారుల కళ్లకే కాక, మన సమాజపు మనసుకీ కొత్త ఆలోచనను అందిస్తుంది. బక్రీద్ అంటే నీ జేబులో ఉన్న మాంసం పంచుకోవడం కాదు... నీ గుండెలో ఉన్న ప్రేమను పంచుకోవడం.

**బక్రీద్ అసలు అర్థం**

ప్రేమ, పంచుకోవడం, త్యాగం. ఇవి ఏ మతానికీ, ఏ జాతికీ చెందినవి కావు. ఇవి ప్రతీ మనిషికీ అవసరమైన విలువలు.

**ముగింపు :**

ఈ బక్రీద్ మనలోని గొప్పతనాన్ని త్యాగగుణాన్ని జాగృతం చేయాలి.
"తప్పకుండా త్యాగం చేయాలి" అని ఎవ్వరు చెప్పరు. కాని - "నీవు సిద్ధమా?" అని బక్రీద్ నిశ్శబ్దంగా మనల్ని అడుగుతుంది.
నమాజ్ కంటే ముందే, మనసు త్యాగానికి సిద్ధం కావాలి.
అదే బక్రీద్ పరమార్థం.

**-తోట సాయి నాథ్ రెడ్డి , సీనియర్ పాత్రికేయులు, లింగాల.**


# పిల్ల కాలువలను వెంటనే పూర్తి చేయాలి

## కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్రువ కుమార్ రెడ్డి

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గంలో పిల్ల కాలువలను వెంటనే పూర్తి చేయాలని, కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్రువకుమార్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలతో పులివెందుల ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సంకల్పించి వేగంగా పనులు చేయించారన్నారు. ప్రస్తుతం పులివెందుల ప్రాంతానికి నీటిని అందించే పైడిపాలెం, సిబిఆర్‌లో నీరు పుష్కలంగా ఉందని,పైడిపాలెం లో 5 టీఎంసీలు, సిబిఆర్ లో 7 టీఎంసీల నీరు ఉందని, ప్రధాన కాలువలు, వాగులు, వంకలు, చెరువుల కు మాత్రమే కృష్ణా జలాలను అందిస్తున్నారు. పిల్ల కాలువలు పూర్తి చేయక పోవడంతో పొలాలకు నీరు అందక రైతులు వర్షం కోసం ఎదురుచూసే దుస్థితి నెలకొందన్నారు. పులివెందుల వాసి మాజీ సీఎం జగన్ రైతులను పట్టించుకోలేదు, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన పిల్ల కాలువలను పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని ధ్రువ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వికసిత కృషి సంకల్ప అభియాన్

## నూతన సాంకేతికత,,, ప్రభుత్వ పథకాలపై సమాచారం.
## డాక్టర్ కదిరి వేల్ సలహాలు సూచనలు..




**పెండ్లిమర్రి, మేజర్‌న్యూ::** వైఎస్అర్ కడప జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారు పెండ్లిమర్రి మండల పరిధిలోని చెర్లోపల్లి, పెండ్లిమర్రి గ్రామాల నందు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం తొమ్మిదవ రోజు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భారత నూనె గింజల పరిశోధన సంస్థకు చెందిన డాక్టర్ కదిరి వేల్ మాట్లాడుతూ రైతుల కు ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో రెండువేల కంటే ఎక్కువ శాస్త్రీయ బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతిక మరియు ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు, నువ్వులలో మేలైన రకాలు యాజమాన్య పద్ధతుల గురించి, సూక్ష్మ నీటి ద్వారా సాగులో సాంకేతికత మరియు డ్రోన్ల సాంకేతికత గురించి వివరించారు. డాక్టర్ వీరయ్య గారు వేరుశెనగ, వరి, మినుములు, నువ్వులు మేలైన రకాల గురించి విత్తన శుద్ధి గురించి, ఎరువులు యాజమాన్యం, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. రైతు సంఘాలుగా ఏర్పడి లాభదాయక వ్యవసాయం వైపు సాగాలని కోరారు మరియు తక్కువ పెట్టుబడి తో నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు తెలియజేశారు. డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి శాస్త్రవేత్త పశు విజ్ఞానం వారు పశువు భాగానికి సంబంధించిన పథకాల గురించి, గొర్రెల మేకల పెంపకం గురించి, వ్యాధుల గురించి, కోళ్లల్లో వ్యాక్సినేషన్ షెడ్యూల్ గురించి వివరిం చారు. ఆర్. గిరీష్ కుమార్ మట్టి పరీక్షల గురించి తెలియజేసారు. ఈ కార్యక్ర ంమంలో చెర్లోపల్లి మరియు పెండ్లిమర్రి సర్పంచ్‌లు గంగిరెడ్డి, నాగమల్లారెడ్డి గ్రామీణ వ్యవసాయ అధికారి, ఆత్మ బీటీఎం, 100 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

# 3వ సచివాలయంలో ఆధార్ సర్వీసు కేంద్రం ఏర్పాటు..

## ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలంటున్న మున్సిపల్ కమిషనర్



**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్:** ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో ఆధార్ సర్వీసు కేంద్రంను మూడవ సచివాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎర్రగుంట్ల మున్సిపల్ ప్రజలు ఇబ్బందులను తెలుసుకొని జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి మహేశ్వర నగర్ లో ఉన్న మూడో వార్డు సచివాలయంలో ఆధార్ సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ ఐచీశీఅవగకార్డులో మార్పులు , చేర్పులు చిరునామా మార్పులు, చేర్పులు ఇతర సేవలను పొందవచ్చు అన్నారు. ఈ ఆధార్ సర్వీస్ కేంద్రం మూడవ సచివాలయంలో శాశ్వతంగా ఉంటుందని, ప్రజలందరూ గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# నేరేడు పండ్లు తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడతుంది

**పులివెందుల, మేజర్‌న్యూస్:** నేరేడు పండ్లు ఈ పేరు చెప్పగానే చాలా మందికి నోరూరుతుంది. ఈ సీజన్‌లో నేరేడు పండ్లు ఎక్కువగా దొరుకుతాయి. మార్కెట్లలో, రోడ్ల మీద ఈ సీజన్‌లో నేరేడు పండ్లు ఎక్కువగా దర్శనమిస్తాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా వీటిని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. అందుకే వీటికి డిమాండ్ ఎక్కువ. నేరేడు పండ్లు తినడానికి రుచికరమైనవి మాత్రమే కాదు, వీటిలో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉన్నాయి. నేరేడు పండ్లు తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడతుంది. నేరేడు పండ్లు శరీరంలోని రక్త లోపాన్ని కూడా తీరుస్తాయి. నేరేడు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడంలో సాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌తో బాధపడేవారికి నేరేడు పండ్లు మంచి ఆప్షన్. బరువు తగ్గాలనుకునేవారికి నేరేడు పండ్లు బెస్ట్ అంటున్నారు నిపుణులు. అయితే, ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నప్పటికీ కొందరు నేరేడు పండ్లు తినకూడదు. వారికి నేరేడు పండ్లు హానికరం కావచ్చు. ఎవరు నేరేడు పండ్లు తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.

**డయాబెటిస్ రోగులు**

ఆయుర్వేదం ప్రకారం, డయాబెటిస్‌తో బాధపడేవారికి నేరేడు పండ్లు ప్రయోజనకరం. రక్తంలో చక్కెరను నియంత్రించడానికి, నేరేడు గింజల పొడి లేదా నేరేడు పండ్లను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. అయితే, ఇన్సులిన్ లేదా యాంటీ-డయాబెటిక్ మందులు తీసుకుంటుంటే, దానిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి చాలా తగ్గుతుంది. ఇది హైపోగ్లైసీమియాకు కారణమవుతుంది. కాబట్టి, డయాబెటిస్ రోగులు వైద్యుడి సలహా మేరకు మాత్రమే నేరేడు పండ్లు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**కిడ్నీలో రాళ్ల సమస్య**

ఈ రోజుల్లో చాలా మంది కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారు నేరేడు పండ్లకు దూరంగా ఉండాలి. నిజానికి నేరేడు పండ్లలో అధిక మొత్తంలో ఆక్సలేట్ ఉంటుంది. దీని వల్ల మూత్రపిండాల్లో రాళ్ల సమస్య పెరుగుతుంది. ఇప్పటికే మూత్రపిండాల సంబంధిత సమస్యలు ఉంటే నేరేడు పండ్లకు దూరంగా ఉండాలి. పొరపాటున వీరు నేరేడు పండ్లు తింటే మీ సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది. అందుకే, ఇలాంటి వారు



వైద్యుణ్ని సంప్రదించి నేరేడు పండ్లు తినడం మేలు.

**కాలేయ వ్యాధులు ఉన్నవారు**

కాలేయ వ్యాధులతో బాధపడేవారు కూడా నేరేడు పండ్లు తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నేరేడు పండ్లలో ఆక్సాలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది కాలేయ వ్యాధి ఉన్న రోగులకు హానికరం. అలాంటి రోగులు నేరేడు పండ్లు పొరపాటున కూడా తీసుకోకూడదు. కాలేయ వ్యాధులతో బాధపడేవారు నేరేడు పండ్లు తినాలనుకుంటే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోవడం ముఖ్యం.


**మలబద్ధకం**

నేరేడులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీంతో నేరేడు పండ్లు అధికంగా తీసుకోవడం వల్ల మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మలబద్ధక సమస్యతో బాధపడేవారు నేరేడు పండ్లు పొరపాటున కూడా తినకండి. తింటే మీ సమస్య ఇంకా తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గర్భిణీ స్త్రీలు

నేరేడు పండ్లు ఒత్తిడి వ్యవస్థను ప్రభావితం చేసే లక్షణాలను కలిగి ఉంటాయి. దీంతో.. గర్భధారణ సమయంలో వీటిని తీసుకోవడం అంత మంచిది కాదు. అంతేకాకుండా నేరేడు పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల గర్భిణీ స్త్రీల రక్త ప్రవాహం ప్రభావితం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.

# ఇరగంరెడ్డి వారి వివాహ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ఇరగంరెడ్డ్ వారి వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం మండల కేంద్రమైన దువ్వూరులోని దేవాన్స్ కళ్యాణమండపంలో జరిగిన చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి భార్య లక్ష్మీదేవిల కుమా రుడు వెంకట లక్ష్మీరెడ్డి చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన బండి వీరారెడ్డి భార్య లక్ష్మి నరసమ్మల కుమార్తె వీరఉమాదేవిల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మైదుకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురా మిరెడ్డి, ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డి,ఎంపీపీ కానాల జయచంద్ర రెడ్డి, మండల వైయస్సార్ కాం గ్రెస్ పార్టీ కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, వైయస్సార్‌సిపి నాయకులు సంఘన లక్ష్మి నారాయణరెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభ రెడ్డి సంఘన హరినాథరెడ్డి, మంచాల రాజారెడ్డి,నారుపల్లె జయచక్రధర్‌రెడ్డి, యం.రాజశేఖరరెడ్డి, ముడుమాల శివశంకర్ రెడ్డి, ఎన్.భాస్కర్‌రెడ్డి, బొమ్ము ఓబుళరెడ్డి, కోట రామమునిరెడ్డి తదితరులు వివాహవేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

## జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** నేడు బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరి, సోదరీమణులకు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత డా దాసరి రవిశంకర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో పండగను జరుపుకోవాలని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా సంతోషంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు. కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకుంటూ ప్రజలు సోదర భావంతో మెలిగి స్ఫూర్తిగా నిలవాలన్నారు.

## ప్రజలతో మమేకమైన

# పోలీస్ సిబ్బంది

## పోలీస్ కానిస్టేబుళ్ళ బదిలీ

**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన రాజుపాళెం పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ లను బదిలీ చేశారు ఇక్కడ పనిచేస్తున్న వి. క్రాంతి కుమార్, సి.ఉదయ్ భాస్కర్ దువ్వూరు పోలీస్ స్టేషన్ బి.సుధాకర్ ప్రొద్దుటూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ కుబదిలీ అయ్యారు పోలీస్ శాఖ తరపున మంచిపనితీరునుకనబరిచారు ఎస్ఐ ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజల నుంచి మన్నలను పొందారు శాంతి భద్రతల విషయంలో గత కొన్ని ఏళ్లుగా ప్రతినిత్యం ప్రజలతో మమేకమై వారు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్నారని తెలుసుకొని నిరాశ వ్యక్తం చేస్తున్నారు పోలీస్ శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించారని అభినందిస్తున్నారు

## మహారాజశ్రీ శ్రీయుత ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : కడప

S.O.P. No - **5/2025**

**1.వీరబోయిన పెంచలమ్మ** ....పిటిషనర్

**V/S**

**1.వీరబోయిన చిట్టెమ్మ**
**2.వీరబోయిన లక్ష్మి నరసయ్య**
**3.వీర బోయిన తనుజ్**
**4.వీరబోయిన రమణ** .... రెస్పాండెంట్స్

**పబ్లిక్ నోటిసు**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై తెలిపిన కోర్టు యందు పిటిషనరైన వీరబోయిన పెంచలమ్మ భర్త అయిన బాల నరసింహులు అతను జీవించి ఉన్న కాలంలో పిటిషనర్ కు సంబంధించిన బంగారు నగలు బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నాడు. అతని మరణానంతరం ఆ బంగారు నగలు తీసుకొనుటకు గాను బ్యాంకు వారి ఆదేశాల మేరకు పై తెలిపిన కోర్టు యందు రెస్పాండెంట్స్ అయిన 1) వీరబోయిన చిట్టెమ్మ, 2) వీరబోయిన లక్ష్మీ నరసయ్య, 3) వీరబోయిన తనూజ్, 4) వీరబోయిన రమణలపై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. పై తెలిపిన రెస్పాండెంట్స్ కాక ఇంకా ఎవరికైనా ఇందు గురించి ఆక్షేపణలు ఉన్నచో తేదీ:17-6-2025 న ఉదయం 10.00 గంటలకు పై తెలిపిన కోర్టు యందు కుద్దున గాని, న్యాయవాది ద్వారా కానీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును లేనియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

**Sri P. BHARANI KUMAR NAIDU**
M.A, B.ED, B.L, Mcs.
**Sri.P.ANIL KUMAR,** B.COM (CA), B.L
Advocate's for Pelitioner Cell-9059777747.

## ప్రతిభ అవార్డుకు గాయత్రి స్కూలు విద్యార్థుల ఎంపిక



**చాపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇవ్వనున్నది . ఈ ప్రతిభ అవార్డుకు గాయత్రి స్కూలుకు చెందిన విద్యార్థులు 1.కొప్పోలు పూజిత, శర్వాణి 2.ఆదిమూలం ధరణి 3.తిప్పలూరు విష్ణు వర్ధన్ రెడ్డి, 4.మల్కిగారి సుబహన ఎంపికైనట్లు గాయత్రి స్కూలు యాజమాన్యం తెలియ జేశారు. 9 వ తేదీన కడప జిల్లా కేంద్రంలో జరగనున్న అవార్డుల ప్రధానోత్సవంలో విద్యార్థులకు ప్రముఖులు అవార్డులను ప్రధానం చేయనున్నట్లు యాజమాన్యం తెలియ జేశారు. తమ పాఠశాల విద్యార్థులు సాధించిన విజయం పట్ల స్కూలు యాజమాన్యం,ఉపాధ్యాయ బృందం మరియు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ చిన్నారులు మరింత ఉన్నతంగా రానించాలని ఆకాంక్షించారు.

## మత సామరస్యానికి ప్రతీక కడప

**బక్రీద్ శాంతియుత వాతావరణంలో, సుఖ శాంతులతో జరుపుకోవాలి**
**జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్**



**కడప క్రైమ్ – మేజర్ న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, సుఖశాంతులతో జరుపుకో వాలని జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఆకాంక్షించారు. సమైక్యతను, సమానత్వాన్ని పెంపొందిస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లిం సోదరులకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తినట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్ పికెట్లు, చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ పార్టీలు, స్పెషల్ పార్టీ, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పుకార్లను, సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎలాంటి ఫిర్యాదు కానీ, ఏ చిన్న సమస్య ఉన్నా డయల్ 100కిగాని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## ఈద్గాలను పరిశీలించిన శ్రీనివాసరెడ్డి




**కడప రూరల్,మేజర్‌న్యూస్:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని, ముస్లిం సోదరులు సామూహిక ప్రార్ధనలు నిర్వహించే ఈద్గాలను టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు.

## జిల్లా ప్రజలకు కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు

**కడప – మేజర్‌న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీక అయిన వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజలకు సకల శుభాలతో పాటు ఆయురారోగ్యాలు అందాలని, అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదినం అత్యంత భక్తి, ప్రీతికరమైనదని... ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్యఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతలనుంచి మానవాళిని జాగృత పరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# భయపెడుతున్న జూన్..

**విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం - ప్రైవేటు పాఠశాలల దోపిడీ..**
**పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు**




ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇతర సామగ్రి కొనాలంటే తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాఠశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఫీజుల భారం పెరిగింది.

**ఏడాది సంపాదనంతా బడికే..**

ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివించాలంటే పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు ఏడాది సంపాదనంతే ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం స్కూలు ఫీజులు పెచుతున్నారని వాపోతున్నారు.

**పుస్తకాలు, యూనిఫాం, బస్సు ఫీజులు..**

ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు సాధారణ ఫీజుతో పాటు డొనేషన్లు, బస్సు చార్జీలు, యూని ఫాం, పుస్తకాల రూపంలో విద్యార్థుల తల్లిదం డ్రులపై అదనపు భారం మోపుతోంది. ఇవన్నీ తమ పాఠశాలలోనే కొనాలన్న నిబంధన విధి స్తుండటతో తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో అదనంగా రూ.10వేల వరకు చెల్లిస్తున్నారు.

**కుటుంబంపై రూ.లక్షల్లో భారం**

కుంటుంబలో ఇద్దరు విద్యార్థులుంటే అంతే. దాదాపు రూ.లక్ష వరకు భారం పడుతోంది. కేవలం పిల్లల స్కూలు ఫీజులకే ఒక్కొక్కరికి రూ.50 వేలకు పైగానే ఖర్చు చేయాల్సి వస్తుందోని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనపడుతున్నారు. ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చేర్పిందుకు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు అవుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ విధించాలని కోరుతున్నారు.

## వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం



**చాపాడు మేజర్‌న్యూస్ :** పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం మరియు వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై సకాలంలో క్షేత్రస్థాయి మార్గదర్శకత్వం అందించడానికి ఖరీఫ్ మరియు రబీ సీజన్లో విత్తనం విత్తే ముందు విక్సిత్ కృషి సంకల్ప్ అభియాన్‌ను రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్ద చీయ్యపాడు, రేపల్లె, గుంతచియ్యపాడు, సోమాపురం, మొరాయిపల్లి, పిచ్చపాడు, అల్లాడుపల్లి, లక్ష్మీపేట, పెద్ద గులవలూరు గ్రామాలలో అధిక రసాయన ఎరువుల వినియోగము– భూసార క్షిణిత అనే అంశంపై డాక్టర్ ఎం. బాలకృష్ణ, కెవికె వనిపెంట వారి అధ్యక్షతన చర్చా కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ నుండి విచ్చేసిన డాక్టర్ బి.సుబ్బరాయుడు, డాక్టర్ జి.శ్యాంప్రసాద్,డాక్టర్, పి.ఉమాకాంత్, ప్రధాన శాస్త్రవేత్తలు చిరుధాన్యాల రకాలు సస్యరక్షణా చర్యలు, మేలైన యజమాన్య పద్ధతులు. పోషక విలువల గురించి తెలియజేశారు. ఊటుకూరు నుండి వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త డాక్టర్, శ్రీ.వల్లి వరిలో అనువైన రకాలు, మినుముల రకాలు వాటి యజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్, విజయ్ కుమార్ పశు పోషణ, కృత్రిమ గర్భాధారణ, టీకా మందులు, అధిక పాల దిగుబడి నిచ్చే పద్ధతుల గురించి తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారిని ఈ.మ్యాగీ ప్రభుత్వ రంగ పథకాలు, ఇత్తన పంపిణీ, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ గురించి వివరించారు. ఉద్యాన విభాగము శాస్త్రవేత్త డాక్టర్, ఎస్. ఫిరోజ్ హుస్సేన్ పసుపులో సమగ్ర పోషణ యజమాన్యము, సస్యరక్షణ, చర్యల గురించి వివరించారు. పూర్ణ చంద్రశేఖర్ డ్రోన్ వినియోగము వాటి వలన ఉపయోగం. డ్రీమ్ సీడింగ్ పద్ధతి గురించి వివరించారు. ఈ కార్యక్రమములో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

## పశువధ నిషేధం ఉల్లంఘిస్తే చేస్తే చట్టపరమైన చర్యలు


**పోస్టర్ ఆవిష్కరణ**
**కమిషనర్ శేషఫణి, వెటర్ని శాఖ ఏడి డాక్టర్ మునయ్యలు**




**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్:** బక్రీద్ పండగ పురస్కరించుకొని ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో ఆవులు చిన్న దూడలు ఒంటెలు వధ నిషేధం చేయడం జరిగిందని, దీన్ని ఎవరు ఉల్లంఘించిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎర్రగుంట్ల వెటర్ని డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునయ్య ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేష ఫణి లు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషన్ శేష ఫణి చేతుల మీదుగా జంతు వు వధ నిషేధం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతు హింస చట్టం, ఆంధ్రప్రదేశ్ గోవు నిషేధ చట్టం, పశు సంరక్షణ చట్టం ప్రకారము ఆవులు చిన్న దూడలు, ఒంటెలు వధ నిషేధం ఉందన్నారు. దీన్ని ఎవరు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వారు సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాంస విక్రయదారులకు, యజమానులకు అవగాహన కల్పించారు. చట్టానికి లోబడి పవిత్రమైన బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో చిలంకూరు వెటర్ని డిపార్ట్మెంట్ అధికారి డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ.పీ. రవీంద్రను అభినందించిన మైదుకూరు జనసేన నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య

**దువ్వూరు, మేజర్‌న్యూస్:** మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మైదుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య, శుక్రవారం మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఏ.పి రవీంద్రను మరియు డైరెక్టర్లు లను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మైదుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధకర్ యాదవ్ పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇచ్చి పదవులు కట్టబెట్టినందుకు కృతజ్ఞత లు తెలుపుతున్నాము అని అన్నారు. అలాగే జనసేన నాయకులకు సముచిత స్థానం కల్పించినందుకు ధన్యవాదా లు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొండయ్య, రామ చంద్రుడు, గోపాల్, జయరాం, కృష్ణయ్య తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.



## లక్ష్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: స్థానిక నెహ్రూ రోడ్డు నందు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి ఆహ్వానం మేరకు లక్ష్య సూపర్ స్పెషా లిటీ హాస్పిటల్‌ని శుక్రవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘు రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నవరం రాంమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టైక్వాండోలో ఏషియన్ యూత్ గేమ్స్ ఎంపిక పోటీలకు సిద్ధం కావాలి



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ ఉమ్మడి కడప జిల్లా తైక్వాండో క్రీడాకారులు మూడవ ఏషియన్ యూత్ గేమ్స్ ఎంపిక పోటీలకు సిద్ధం కావాలని జిల్లా అసోసి యేషన్ పిలుపు నిచ్చింది. బహ్రెయిన్ దేశంలో జరుగు 3వ ఏషియన్ యూత్ గేమ్స్ (2025) కు సంభందించి తైక్వాండో ఓపెన్ సెలెక్షన్స్ ట్రయల్స్ ను ఇండియా తైక్వాండో (జాతీయ సంఘం) మహారాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9,10,11 తేదీలలో నాసిక్ పట్టణంలోని డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు నిర్వహించడం జరుగుతుందని కడప జిల్లా తైక్వాండో క్రీడ ఇంచార్జ్ ఎస్. గురుస్వామి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మునీశ్వర్ తెలిపారు. ఆసక్తి కల్గిన ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు 8వ తేదీలోపల ఇండియా తైక్వాండో. కామ్ పోర్టల్ లో యుఐడి కోసం రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీల కు 15 నుంచి 16 సంవత్సరాల బాల, బాలికలు మాత్రమే అర్హులు అన్నారు. మొత్తం ఐదు వెయిట్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయని, ఎంపిక అయిన క్రీడాకారులు అక్టోబర్ 22 నుంచి 31 వరకు బహ్రెయిన్‌లో జరుగు 3వ ఏషియన్ యూత్ గేమ్స్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 91105 56525: 92900 70715 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## చైతన్య విద్యార్థులకు ప్రతిభా అవార్డు

### సిఎం చేతుల మీదుగా నగదు బహుమతి

### హర్షం వ్యక్తం చేసిన యాజమాన్యం



వేంపల్లె, మేజర్ న్యూస్: స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రతిభా అవార్డు వరించింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబం ధించి పదోతరగతి పరీక్షల ఫలితాల్లో జీ.సా యినాధ్ 597, గురు భావన 595 మార్కులతో అధ్భు తమైన ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డుకు ఈ విధ్యార్థు లు ఎంపికయ్యారు. సిఎం చంద్ర బాబు చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంస పత్రంతో పాటు ట్యాబ్‌లు అందుకో నున్నారు. ప్రతి ఏడాది తమ పాఠశాల నుంచి విధ్యార్థు లు ప్రతిభా అవార్డుకు ఎంపికవు తున్నట్లు కరెస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించడం తమ పాఠశాల ప్రత్యేకత అని అభిప్రాయపడ్డారు. డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి విధ్యార్థుల ఎంపిక పట్ల సంతో షాన్ని తెలియ పరిచారు.

## నాలుగు ప్రతిభ అవార్డులు సాధించిన ఆంటోనీస్ సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం స్కూల్



కలసపాడు మేజర్ న్యూస్. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల మేధాశక్తి అనుకూలంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మండలానికి ఐదు ప్రతిభ అవార్డులను కేటాయించారు. ఈ ఐదు షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులలో భాగంగా కలసపాడు మండలం లోని సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు నాలుగు ప్రతిభ అవార్డులను విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గడచిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్.కిరణ్ కుమార్ రెడ్డి 600 మార్కులకు గాను 591, సాధించారు. అలాగే ఎన్. రక్షిత రెడ్డి 600 మార్కులు గాను 586 మార్కులను, ఎం. మహిత 600 మార్కులు గాను 577 కే. రమ్య 600కు 573 మార్కులు సాధించి ప్రతిభ అవార్డ్స్ కి ఎంపికయ్యారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం నుండి గోల్డ్ మెడల్స్ మరియు 20 వేల రూపాయల నగదు బహుమతిని అందిస్తారని తెలిపారు. విద్యార్థుల ఔన్నత్యానికి ,ఉజ్వల భవిష్యత్తుకు, చక్కటి చదువుకు, క్రమశిక్షణకు, పాటుపడిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తా, ప్రభావతిని, అధ్యాపక బృందాన్ని మరియు తల్లిదండ్రులను అభినందించారు.

## ప్రభుత్వ వసతి గృహాలలో ఏసియం పిచికారి

### సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



పులివెందుల మేజర్ న్యూస్ మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని, జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు పులివెందుల సబ్ యూనిట్ పరిధిలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పులివెందుల ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహంలో మరియు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల పులివెందుల ఏ.సి.యం పిచికారీ కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమాన్ని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. హాస్టల్ పరిసరాల్లో దోమలను అరికట్టడానికి, విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పిచికారీ చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ, "విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ప్రభుత్వ వసతి గృహంలో పిచికారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ఇది ఒక ముఖ్యమైన చర్య," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమ లింగారెడ్డి, వసతి గృహ సిబ్బంది రమేష్ రెడ్డి, శివమ్మ పాల్గొన్నారు.

## ప్రతిభ అవార్డుకు ఉషాకిరణ్ విద్యార్థుల ఎంపిక

### కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి



వేంపల్లె, మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వము పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇవ్వనున్నది. ఈ ప్రతిభ అవార్డుకు ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పూనేటి తేజేష్ , పడమటింటి కేశవానందు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యార్థులను అభినందించారు. 9వ తేదీ కడప జిల్లా కేంద్రంలో జరగనున్న అవార్డుల ప్రధానోత్సవం లో విద్యార్థులకు ప్రముఖులు అవార్డును ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. తమ పాఠశాల విద్యార్థులు సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ చిన్నారులు మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## గుడిపాడు విద్యార్థి జితేంద్రకు ప్రతిభా అవార్డు

### జితేంద్రకు పలువురి అభినందనలు

దువ్వూరు, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో 2024-2025 పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గాను షైనింగ్ స్టార్స్ పథకం కింద ప్రతిభా అవార్డులు ప్రకటించగా దువ్వూరు మండలానికి ఆరు అవార్డులు ప్రకటించగా దువ్వూరు మండల ఫస్ట్ (589/ 600) మార్కులు సాధించిన శ్రీ శంకరాచార్య హై స్కూల్ గుడిపాడు విద్యార్థి పిచ్చోళ్ళ జితేంద్రకు అవార్డు రావడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ ముతే రామ్మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెస్పాండెంట్ రామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థికి ప్రతిభా అవార్డు రావడం పట్ల గుడిపాడు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇదే విద్యార్థికి పాలిసెట్లో కూడా 120 కి 110 మార్కులు సాధించి ప్రతిభా చాటాడని తెలిపారు. జితేంద్రకు ప్రతిభా అవార్డు రావడం పట్ల మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, మేధావులు, విద్యార్థి సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.



# ముగిసిన సమ్మర్ క్యాంప్ విజేతలకు బహుమతి ప్రదానం




ప్రొద్దుటూరు మేజర్ న్యూస్:
పట్టణం లోని వసంతపేట మున్సిపల్ హైస్కూల్ నం దు రామేశ్వరం బాలబాలికల గ్రంథాల యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో చివ రి రోజు ఈ సమ్మర్ క్యాంప్‌లో చిన్నారు లకు నిర్వహించిన పద్యపటనం, జిరాఫీ చెస్, తదితర పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నా రులకు బహుమతి ప్రదానం చేశారు. కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా వసంతపేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు గుర్రప్ప, ప్రముఖ రచయితలు జింకా సుబ్ర హ్మణ్యం, చదువులబాబు, ఉత్తమ ఉపా ధ్యా యులు గజ్జల వెంకటేశ్వర రెడ్డి, రాయల సీమ పిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ లైబ్రేరియన్ నడమల గంగాధరరెడ్డి పాల్గొనగా వీరితో పా టు జిరాఫీ చెస్‌కోచ్‌లు నాగార్జున, అర విం ద్‌ను గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ సన్మానించారు.

# ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

## గ్రంధాలయ అధికారిణి వనజ కుమారి



వేంపల్లె, మేజర్ న్యూస్: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు ఘనంగా ముగిసిన గ్రంథాలయ అధికారిణి వనజ కుమారి అన్నారు. శుక్రవారం ఈ విజ్ఞాన శిబిరంలో విధ్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 28న ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 6 వ తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. పాల్గొన్న విధ్యార్థులకు రకరకాల ఆటల పోటీలు, చదవడం మాకిష్టం ద్వారా బహుమతులు ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట రామిరెడ్డి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రెడిట్ సొసైటీలో ప్రతి బ్రాహ్మణుడు సభ్యులుగా చేరండి

## జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు ప్రసాద్ రావు



వేంపల్లి, మేజర్ న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లో బ్రాహ్మణులు అందరు సభ్యులు గా చేరాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పి వి ఎస్ వి. ప్రసాదరావు ఒక ప్రకటన లో కోరారు. క్రెడిట్ సొసైటీ లో సభ్యులు గా చేరితే ఎన్నో లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. సభ్యులు గా చేరినవారు ముగ్గురుగా ఉంటే గ్రూప్ లో లోన్స్ మంజూరు చేస్తారని బ్యాంకుల కంటే తక్కువ వడ్డీ అని తెలిపారు. అదే విధంగా వ్యక్తిగత రుణాలు తీసుకొనే అవకాశం ఉందని అంటూ వ్యాపారం కోసం మొదట్లో రెండు లక్షల రూపాయలు ఋణం గా పొందవచ్చని అన్నారు. బ్యాంకుల్లో తీసుకొనే వడ్డీ కంటే తక్కువ కాబట్టి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యత్వం ఉంటేనే అవకాశం అని 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు సభ్యత్వం పొందవచ్చని అన్నారు. అంతేగాక సభ్యత్వం ఉన్న వ్యక్తులు ఆకస్మికంగా మరణిస్తే సొసైటీ 50,000 రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. 600 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకొంటే 100 రూపాయలు మెంబర్షిప్ కోసం తీసుకోని 500 రూపాయలు డిపాజిట్ గా పెట్టుకుంటారని సభ్యత్వం వద్దని అనుకొన్నప్పుడు 500 రూపాయలు తిరిగి ఇస్తారని తెలిపారు. ఇప్పటికి సభ్యత్వం తీసుకొని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బక్రీద్ సందర్భంగా నేడు, రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

## శిల్పారామం ఏఓ ఎస్.కృష్ణ ప్రసాద్



కడప టౌన్ మేజర్ న్యూస్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు శిల్ కళా వేదిక పై నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రీమ్ మీడియా సుజాత వారి సహకారంతో ప్రముఖ నృత్య కళాకారులైన విజయశాంతి ఆధ్వర్యంలో వారి ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఆదివారం జబర్దస్త్ లోని ఆర్టిస్ట్ లు మన శిల్పరామం కు విచ్చేస్తారని తెలిపారు. జబర్దస్త్ బృందం తమ కామెడీ స్కిట్లతో పాటు ప్రేక్షకులకు ఆహా అనే విధంగా ప్రత్యేక నృత్యాలు ఉంటాయని వివరించారు. కావున పుర ప్రజలు బక్రీద్ పండుగ సందర్భంగా 2 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను తిలకించి పులకించాలని వారు కోరారు

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

## పెండ్లిమర్రి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహబూబ్ బాషా



పెండ్లిమర్రి, మేజర్ న్యూస్ బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం మైనారిటీ. సోదరి సోదరులకు పెండ్లిమర్రి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహబూబ్ బాషా శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలనీ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ కుండా సంతోషంగా జరుపుకోవాలని ఆయన తెలియజేశారు. కులమతాలక తీతంగా పండగలు జరుపుకుంటూ కడప జిల్లా ప్రజలు సోదర భావంతో మెలిగి స్ఫూర్తిగా నిలవాలన్నారు.

# ఎర్రగుంట్ల ఐసిఎల్ వద్ద కార్మికులు కొనసాగుతున్న ధర్నా




ఎర్రగుంట్ల మేజర్ న్యూస్: ఎర్రగుంట్ల ఐసిఎల్ అండ్ అల్ట్రాటెక్ కంపెనీ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద అందులో పనిచేసే కార్మికులు చేస్తున్న ధర్నా శుక్రవారం నాటికి రెండో రోజు చేరుకుంది. ఉదయం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో ఐసిఎల్ ప్రధాన గేటు వద్దకు చేరుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అక్కడే వంటావార్పు చేస్తూ నిరసన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఐసిఎల్ యాజమాన్యం కార్మికుల పట్ల మండి వైఖరి తో ఉందని వారు మండిపడ్డారు. ఉదయము ఐసిఎల్ లో పనిచేస్తున్న మెయింటెనెన్స్ కార్మికులను ఫ్యాక్టరీలోకి పోకుండా, ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు అడ్డుకున్నారు. కార్మికులందరికీ ఐసీఎల్ యాజమాన్యం న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. కార్మికుల చేస్తున్న నిరసనకు మద్దతుగా మండల పరిధిలోనే వివిధ గ్రామాలలో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు.

# ఘనంగా తిరుమలయ్య ఉద్యోగ విరమణ



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ పోరుమామిళ్ల మండలం దాసరి పల్లె గ్రామానికి చెందిన పండుగాయల తిరుమలయ్య ఉమ్మడి కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ మే 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా తిరుమలయ్య సుదీర్ఘకాలం ఉద్యోగం చేసి, సహోద్యోగులతో కలసి మెలసి మెలుగుతూ, అందరి మన్ననలు పొంది, అందరిచే మంచిగా గుర్తింపు పొం దారు. శుక్రవారం పోరుమామిళ్ల పట్టణం మలకత్వ వద్ద ఉన్న వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నందు తిరుమలయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, స్నేహి తులు, ఉద్యోగస్తులు పాల్గొని తిరుమ లయ్య వారి సతీమణిను పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి, శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆశీర్వదించారు.

# ఆయా ప్రాంతాల్లో మంచినీటి సరఫరా

## సర్పంచ్ చొరవపై ప్రజలు హర్షం




వేంపల్లె, మేజర్ న్యూస్: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో మంచినీటి సరఫరా చేశారు. పాపాగ్నీ నదిలో పెద్ద పైప్ లైన్ పగిలి పోవడంతో ఈ విషయాన్ని స్థానిక ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. సర్పంచ్ చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పైప్ లైన్ మరమ్మతు పనులకు పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ఆదేశించారు.

# నూతన నటీనటీమణులకు ఆహ్వానం

పులివెందుల మేజర్ న్యూస్ శ్రీ నటరాజ లక్ష్మీ నరసింహా మూవీస్ వారు శ్రవణ్ కుమార్ దర్శకత్వంలో విద్యా దీపం సినిమా నిర్మిస్తున్నారు ఈ సినిమాలో ముత్తు మల లోకేష్ హీరో (సఖి హీరో) మరియు సావిత్రి కృష్ణ హీరోయిన్(సినిమా పిచ్చోడు) పల్లవి హీరయిన్ రాఘవేంద్రరెడ్డి రామ్‌లక్ష్మణ్ రెడ్డి ప్రధాన పాత్రలో నటించ ను న్నారు. మిగతా పాత్రల కోసం గవర్న మెంట్ ఉమెన్స్ జూనియర్ కాలేజ్‌లో 8-6-2025 ఆదివారం ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని నూతన నటులు నటీమణులు పాల్గొని తమ వచ్చిన అవకాశాన్ని సద్విని యోగించు కోవల సిన కోరారు. వివరాల కోసం సంప్రదించ వలసిన ఫోన్ నంబర్లు 1.807400 7819 డైరెక్టర్, 2.7981428780 ఎడిటర్ రవి. 3.9160608077, రాఘవేంద్రరెడ్డి. యాగంటి, 4. 9440456715 రామ్‌లక్ష్మణ్ రెడ్డి

# పత్రాలు లేకుండా బండి నడిపితే జైలుకు పంపిస్తాం

## పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. రమణా రెడ్డి



మైదుకూరు మేజర్ న్యూస్: మైదుకూరు పట్టణంతో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో సిఐ కె.రమణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. కొందరు ద్విచక్రవాహన దారులు ఎలాంటి నెంబర్‌ప్లేట్, పత్రాలు లేకుండా తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తూ కేసులు, జరిమానాల నుంచి తప్పించుకుంటున్న ఘటనలు పెరిగిపోవడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కొందరు మైనర్‌లు, యువకులు నెంబరు ప్లేట్‌లు లేకుండా ద్విచక్రవాహనాలతో తిరుగుతూ త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్, ఓవర్‌స్పీడ్ గా వెళ్లి ఇతరులను ఇబ్బందిపెడుతున్నారు. మరో వైపు చెయిన్ స్నాచింగ్, తాళంవేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడటం, మద్యం సేవించి, అతివేగంతో రోడ్డు ప్రమాదాలు చేయటం వంటి తీవ్రమైన సంఘటనల్లో నిందితులు నెంబర్‌ప్లేట్‌లులేని వాహనాలను ఉపయోగిస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే భారీ జరిమానా విధించటంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని,అలాగే కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శివప్రసాద్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు బక్రీద్ పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి ఎస్సై తిమోతి



కలసపాడు మేజర్ న్యూస్ :కలసపాడు మండలంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ఎల్ తిమోతి తెలిపారు ముస్లిం సోదరులు సోదర భావంతో అంకిత భావం కలిగి పండుగ నిర్వహించుకోవాలని, ఎక్కడ ఎలాంటి గొడవలకు ఘర్షణలకు తావు లేకుండా అల్లాహ్ మార్గాలను పాటిస్తూ శాంతి సహనం కలిగి పండుగ జరుపుకోవా లని సూచించారు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండా వాటిని అనుసరించాలని తెలిపారు శాంతి భద్రతల పరిరక్షణకు ముస్లిం సోదరులు మండలంలో ప్రజలు తమకు సహకరిం చాలని ఆయన కోరారు ముఖ్యంగా గోవధ జరపకూడదని గోవధ జరిపిన అందుకు సహకరించిన చట్టరీత్య చర్యలు ఉంటాయని అన్నారు బక్రీద్పండు గసందర్భంగా ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తమ పోలీస్ శాఖ తరపున తెలుపుతున్నామన్నారు.

# యోగ తో సంపూర్ణ ఆరోగ్యం

## యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా యోగా శిక్షణా తరగతులు



కడప ప్రతినిధి - మేజర్ న్యూస్ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని యోగా శిక్షకులు పేర్కొన్నారు. శుక్రవారం యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలలో యోగ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ నెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 ప్రాముఖ్యతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో వివిధ మండలాలు గ్రామాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి.ప్రజలందరూ యోగా ఆవశ్యకతను తెలుసుకునేలా అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయటం వల్ల కలుగు ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. యోగ వల్ల శరీరం దృఢంగా మారడంతో పాటు మానసిక వికాసం వెల్లివిరుస్తుందని ఎన్నో జబ్బులు తగ్గుతాయని నిరంతరం వ్యాయామం చేయడం చాలా మంచిదని యోగా శిక్షకులు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆరుబయట ప్రాంగణాల్లో సూర్య నమస్కారాలు యోగ ఆసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, యోగా శిక్షకులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనంపై అధికారికంగా ముందస్తు డేట్ ఫిక్స్ చేయాలి

## రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ డిమాండ్



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: మహానాడులో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పాఠశాలలు తెరవక ముందే తల్లికి వందనం ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ ఇస్తామని ప్రస్తావన చేసి వారం రోజులు కావస్తున్న ఇంతవరకు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులకు అధికారిక అప్డేట్ అందించకపోవడం బాధాకరం అని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కడప మహానాడులో తల్లికి వందనంపై ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చే విధంగా చర్యలు తీసుకొని సంబంధిత విద్యాశాఖ అధికారులకు అధికారిక ముందస్తు అప్డేట్ అందజేసి డేటా సేకరిం చాలన్నారు. ముందస్తు అప్డేట్ ఇవ్వడం వలన విద్యార్థుల తల్లిదండ్రులు కొన్ని డిజిటల్ సమస్యలు ఉండడం వలన వాటిని పూర్తి చేసుకుని ఈ పథకానికి అర్హులయ్యే దానికి అవకాశం ఉంటుందని వారు తెలియజేశారు ఈ విధంగా చేయక పోవడం వలన డిజిటల్ సమస్యలు ఉన్న వారు ఈ పథకాన్ని కోల్పోతారని వారు తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పై ముందస్తు డేట్ ఫిక్స్ చేసి ఇటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.


# ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

## ఇక ఆర్.ఎస్.కే స్థాయిలో శిక్షణలు



కడప - మేజర్ న్యూస్ ప్రకృతి వ్యవసాయంపై వైఎస్ఆర్ కడప జిల్లా డీపీఎం కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. చివరి రోజు శుక్రవారం పాల్గొన్న అధికారులు తమ అభిప్రాయాలు, శిక్షణలో నేర్చుకున్న విషయాలను పంచుకున్నారు. తమ డివిజన్లలో ప్రకృతి వ్యవసాయం అమలు చేసే అవకాశాలపై చర్చించారు. శిక్షణా కార్యక్రమం ముగింపు రోజునే అధికారులు మరియు మాస్టర్ ట్రైనర్లు కలిసి తమ డివిజన్లలో ఈ శిక్షణల అమలుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్, వ్యవసాయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జూమ్ సమావేశం ద్వారా అధికారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకునారు. డిపిఎం ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన అధికారులు రాబోయే జూన్ 12 మరియు జూన్ 19 నుండి రెండు బ్యాచ్ లుగా మూడు రోజుల పాటు ఆర్ఎస్ కే స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. కార్యక్రమంలో థీమాటిక్ లీడ్ సురేష్ బాబు, అదనపు డిపిఎం వసంత కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు, హార్టికల్చర్ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి శిక్షణలో మహిళలకు అవగాహన




ఎర్రగుంట్ల మేజర్ న్యూస్: ఎర్రగుంట్ల మండల పరిధిలోని సున్నపురాళ్ల పల్లి గ్రామ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా తయారీలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ గ్రామ సర్పంచ్ వరలక్ష్మి తెలియజేశారు. శుక్రవారం నిర్వహించిన సదస్సులో జూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపే తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు గ్రామ నాయకులు మణినాథరెడ్డి పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఆటో రిక్షాలో మంటలు

## దగ్ధమైన మోటర్ బైకు



- వేంపల్లె, మేజర్ న్యూస్: మూటలు మోసే ఆటో రిక్షాలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో ఆటో రిక్షాకు ముందు భాగంలో ఉన్న మోటర్ బైకు అగ్ని మంటల్లో దగ్ధం అయ్యింది. వేంపల్లెకు చెందిన రహంతుల్లా అనే బ్రతుకు దెరువు కోసం రిక్షాకు మోటర్ బైకును బిగించుకొని రిక్షాలో మూటలు మోసుకొని కూలి పనులు చేసుకొంటున్నాడు. అయితే గురువారం రాత్రి పులివెందుల రోడ్డులోని టిఎంఆర్ సూపర్ మార్కెట్ వద్ద వాహనాన్ని నిలిపి ఉండగా ఒక్క సారిగా రిక్షాకు చెందిన మోటర్ బైకులో మంటలు వ్యాపించడంతో చుట్టూ ప్రక్కల ఉన్న వారు మంటలను అదుపుచేసేందుకు నీటిని వేయడం జరిగింది. మంటలు ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పిపోయిందని స్థానికులు తెలిపారు. బ్రతుకు దెరువు కోసం తెచ్చుకున్న మోటర్ బైకు ఖాళీ పోవడంతో బాధితుడు రహంతుల్లా ఆర్థికంగా నష్టపోయినట్లు వాపోయాడు. రిక్షాకు మోటర్ బైకును అమర్చాలంటే ఆర్థిక స్థోమత లేదని బాధితుడు తెలిపారు. కూలి పనులు చేసుకొని జీవించే తనకు రిక్షాకు బైకును అమర్చు కొనేందుకు ఆర్థిక సహాయం చేయాలని బాధితుడు కోరారు.

# ఎక్కువ మంది పిల్లల్ని కనండని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం : డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



వేంపల్లి, మేజర్ న్యూస్: ఎక్కువ మంది పిల్లల్ని కనండి, జనాభా పెరగాలి,యిది అత్యంత అవశ్యం అని ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు పదేపదే చెప్పడం విడ్డూరం, హాస్యాస్పదం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు.శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలో 242 దేశాలున్నాయని, ప్రపంచ జనాభా 809 కోట్లని ,ఇందులో మన దేశ జనాభా 144కోట్లని అన్నారు.చైనా జనాభా 142 కోట్లు.అమెరికా జనాభా 34 కోట్లు.ఇప్పటికే చైనాను దాటి నెంబర్‌వన్ స్థానంలో ఉన్నాము. ప్రపంచ జనాభాలో భారత్ జనాభా 18 శాతం కాగా ప్రపంచ విస్తీర్ణం లో భారత్ విస్తీర్ణం 2.4 శాతం మాత్రమే.జన సాంద్రత (చదరపు కిలోమీటర్ కు జనాభా) విషయం లో కూడా మన దేశం లో ఎక్కువ.ప్రపంచ సరాసరి 55 మంది కాగా భారత్ లో 488, చైనాలో 151,అమెరికా లో 38,రష్యాలో 9 మంది వుండడం గమనార్హం. వున్న జనాభాకే,ప్రత్యేకించి యువతకు ఉపాధి,ఉద్యోగాలు లేవు.మద్యం, డ్రగ్స్, గంజాయి కి యువత బానిసలై సంఘ వ్యతిరేక శక్తులుగా తయారై తల్లి దండ్రులకు భారమవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా,దేశ వ్యాప్తంగా స్థానికులకే ఉద్యో గాలు, ఉపాధి అన్న భావన రోజు రోజుకూ పెరిగిపోతూ వుంది. అమెరికా, తదితర దేశాల లో వున్న ప్రవాస భారతీయులు ఉద్యోగాలు ,ఉపాధి వదులుకొని దేశానికి తిరిగి వచ్చే పరిస్థి తు లున్నాయి. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం ఎక్కువగా వున్నాయి. ఆకలి సూచికలో, సంతోష సూచిక అట్టడుగు స్థాయి లో ఉన్నాము. పులిని చూచి నక్క వాత లు పెట్టుకున్నట్లు వుంది. జపాన్, మరికొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి పోతూ వుంది,వృద్ధులు ఎక్కువై పోతున్నారు.మనకూ ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఎక్కువ మంది పిల్లల్ని కనాలని ముఖ్య మంత్రి చెప్పడం సమర్థనీయం కాదు. జపాన్ ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశం. ఆ దేశ జనాభా కేవలం 12 కోట్లు మాత్రమే.జన సాంద్రత కూడా 340. మన కంటే తక్కువ. కాబట్టి ముఖ్యమంత్రి ఈ విషయంలో పునరాలో చించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే మాధవి



కడప రూరల్ మేజర్ న్యూస్:

అనారోగ్యాల బారిన పడి ఆర్థికంగా చితికిన, పేదలకు సీఎం సహాయనిది వర మని ప్రభు త్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లో ఆమె నివాసం లో శుక్రవారం సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ, 12,99,807 విలువైన 18 చెక్కులను లబ్ధిదారులకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే మాధవి అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక సమ స్యలు ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచేలా సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియో గిస్తున్న తెలుగు దేశం ప్రభుత్వం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని చెప్పారు.


# మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా శీలం వనజ ప్రమాణ స్వీకారం

## మైదుకూరు మార్కెట్ యార్డ్‌లో మొదటిసారి బ్రహ్మంగారి మఠం మహిళకు అవకాశం




బ్రహ్మంగారిమఠం మేజర్ న్యూస్ మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ సతీమణి శీలం వనజ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఏర్పడినప్పటి నుండి మేము మా కుటుంబ సభ్యులు మా కులం సంఘం సభ్యులు ఎనలేని కృషి చేశామని మా సేవలను మా నియోజకవర్గపు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ గుర్తించి నేడు మాకు ఈ పదవిని అప్పగించినందు కు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఇది మహిళా సాధికారతకు ఒక నిదర్శనం లాంటిదనీ వారు మాపై పెట్టిన నమ్మకం తో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల కోసం కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేకి మైదుకూరు మార్కెట్ యార్డ్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు అనంతరం ఆమె భర్త తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఏర్పడినప్పటి నుంచి మా గౌడ కుల సంఘం వారు తెలుగుదేశం పార్టీతోనే ఉంటూ పార్టీకి విశేష సేవలు చేస్తున్నా మా కులానికి మాకు ఎవరు గుర్తించలేదు అయితే మొట్టమొదటిసారిగా మా గౌడ కులం వారు చేసిన సేవలను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ గుర్తించి పదవి ఇచ్చారన్నారు, అలాగే మండల తెలుగుదేశం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన శీలం వనజ ఆమె భర్త తెదేపా మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్‌ను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్ను పల్లి సుబ్బారెడ్డి,సీనియర్ నాయకులు యస్ఆర్ శ్రీనివాసుల రెడ్డి,యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, సాంబశివ రెడ్డి,పూజ శివయ్య, బోలా శ్రీను, అంబిశెట్టి వెంకటసుబ్బయ్య ,ఘనంగా సత్కరించారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ రవీంద్రను సన్మానించిన టిడిపి నాయకులు



బ్రహ్మంగారిమఠం మేజర్ న్యూస్ మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఏ.పి రవీంద్రను మరియు బ్రహ్మంగారి మఠానికి చెందిన డైరెక్టర్ శీలం వనజ మిగ తా డైరెక్టర్లను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మండల తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు చెన్ను పల్లి సుబ్బారెడ్డి, మండల తెలుగు దేశం నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, కానాల మల్లికార్జున రెడ్డి, సాంబశివారెడ్డి, పూజ శివయ్య యాదవ్, రాష్ట్ర కాపు నాయ కులు పోతు లూరయ్య, మేకల సుధాకర్, శీలం నరసింహ గౌడ్ , నాగయ్య యాదవ్ , బ్రహ్మంగారిమఠం నేటి దినపత్రిక సూర్య విలేకరి వెంకటసుబ్బయ్య,తదితర నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బంధువులు, మిత్రులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

## 705 పోస్టులకు 43575 మంది దరఖాస్తు

## జిల్లా విద్యా శాఖ అధికారులు వెల్లడి



కడప ఎడ్యుకేషన్ (మేజర్ న్యూస్) డీఎస్సీ ఆన్ లైన్ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు.గత శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 30 వతేదీ వరకు జరగ నున్నాయి.జిల్లాలో 43575 మంది అభ్యర్థులు రాస్తున్నారు.రెండు విడుతల్లో పరీక్షల నిర్వహణ ఉంటుంది ఉదయం సెషన్ 9:30 నుంచి 12 వరకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.ఇందులో ఒక రోజు ఇంగ్లీష్ ప్రొఫిసెన్సీ టెట్ నిర్వ హణ ఉంటుంది.ఈ పరీక్ష కూడా రెండు దఫాలుగా ఉంటుంది ఉదయం 11 నుంచి 12:30 వరకు మధ్యాహ్నం 4 నుంచి 5:30 వరకు ఉంటుంది

**జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు**

డీఎస్సీ ఆన్ లైన్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఇందులో బాగంగా కడపలో 6 ప్రొద్దుటూరు లో 3 ఏర్పాటు చేశారు.కడప లో కేఎస్ ఆర్ ఎం,కేఓ ఆర్ ఎం, కే ఎల్ ఎం, శ్రీనివాసా స్విస్ట్ , అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీల్లో నిర్వహిస్తారు.వీటిలో 30,586 మంది అభ్యర్థులు రాయను న్నారు.ప్రొద్దుటూరు లోని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వాగ్దేవి సీబీఐ టీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. అయితే పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ 144 సెక్షన్ ను అమలు చేశారు.స్థానికంగా ఉండే జి రాక్స్ సెంటర్లు ను మూయిం చారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమ తించ లేదు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరు కున్నారు. హాల్ టికెట్లను పరిశీలించి లోనికి అనుమతించారు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఉదయం 936 మంది పరీక్ష కు హాజరు కావాల్సి ఉండగా 862 మంది మాత్రమే హాజరయ్యారు.74 మంది గైర్హాజరయ్యారు.మద్యాహ్నం 845 మంది హాజరు కావాల్సి ఉండగా 722 మంది హాజరయ్యారు 123 మంది గైర్హాజరయ్యారు. సంబదిత అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

**పర్యవేక్షణ**

పరీక్ష పర్యవేక్షణకు ప్రతి కేంద్రంలో ఒక డిప్యూటీ కలెక్టర్, ఒక డిపార్ట్మెంట్ అధికారి, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ ను నియమించినట్లు డీఈవో శంషుద్దీన్ తెలిపారు.వీరితో పాటు కడపకు కడప డివిజన్ డిప్యూటీ డీఈ రాజగోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరుకు ప్రొద్దుటూరు డిప్యూటీ ఈవో మీనాక్షిని నియమించినట్లు తెలిపారు

# ఎల్ఎల్‌బి సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల




పెండ్లిమర్రి మేజర్ న్యూస్. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎల్.ఎల్.బి (3,5 సంవత్సరాల),3 5, 7, 9 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అకడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి శుక్రవారం పరిపాలన భవనంలో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్.ఎల్.బి మూడో సెమిస్టర్ 81 శాతం ఫలితాలు, ఐదో సెమిస్టర్ లో 76శాతం ఫలితాలు, ఏడో సెమిస్టర్ లో 61 శాతం, తొమ్మిదో సెమిస్టర్ లో 91.67 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎల్.ఎల్.బి మూడు సంవత్సరాల కోర్సు 3వ సెమిస్టర్ లో 23.81 శాతం, 5వ సెమిస్టర్ లో 88.24 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని రిజిస్ట్రార్ అభినందించారు.